www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 డిసెంబర్ 2025
5

వైఎస్ఆర్

వ్యాసరచన పోటీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 142వ వర్ధంతిని పురస్కరించుకుని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 12 వరకు బ్రౌన్ గ్రంథాలయం వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం డిగ్రీ కళాశాల విద్యార్థులకు రామాయణ, భారత, భాగవతాలలోని విషయాల గురించి 'ధారణ పరీక్ష'ను నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, కందిమళ్ళ రాజారెడ్డి, ఎన్.సుబ్బారాయుడు వ్యవహరించారు. శ్రీ హరి డిగ్రీ కళాశాల, నిర్మల నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేయర్ ఎన్నికపై..
ఉత్కంఠ?!

ఒకవైపు కోర్టు, మరోవైపు ఎన్నికల కమిషన్
నలుగురు ఆశావహుల మధ్య నువ్వానేనా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప కార్పొరేషన్ మేయర్ ఎన్నిక వ్యవహారం ఉత్కంఠను కలిగిస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 11న మేయర్ ఎన్నికను నిర్వహించాలని కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జాయింట్ కలెక్టర్ ఈ నెల ఏడవ తేదీ నాటికి కార్పొరేటర్లు, కో-ఆప్షన్ మెంబర్లకు మేయర్ ఎన్నిక నిర్వహణకు సంబంధించిన నోటీసులు జారీ చేసింది. మాజీ మేయర్ కె.సురేష్‌బాబు రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టును మరోసారి ఆశ్రయించారు. హైకోర్టు తీర్పును బుధవారం వెలువరించే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గురువారం మేయర్ ఎన్నిక నిర్వహణకు కసరత్తు ముమ్మరం చేసింది. కార్పొరేషన్ మేయర్ ఎన్నిక వ్యవహారం ఉత్కంఠను కలిగిస్తుండడం గమనార్హం. వైసిపికి చెందిన కార్పొరేటర్లలో మేయర్ పదవిని దక్కించుకో వడంపై ముగ్గురు కార్పొరేటర్లు ముమ్మరంగా పావులు కదుపుతుండడం ఆసక్తిని కలిగిస్తోంది.

కిరీటం ఎవరికి దక్కేనో!

కడప కార్పొరేషన్ మేయర్ పదవి ఎవరికి కేటాయించనేది అంశంపై వైసిపిలో స్పష్టత కొరవడింది. వైసిపికి చెందిన 42 మంది కార్పొరేటర్లు ఉండగా నలుగురు ఆశావహులు పోటీ పడుతున్నారు. 47వ డివిజన్ కార్పొరేటర్ పాశ సురేష్, 36వ డివిజన్ కార్పొరేటర్ బసవరాజు, 7వ డివిజన్ కార్పొరేటర్ గంగరాజు, 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లి మేయర్ పదవి రేసులో ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర హైకోర్టు తీర్పు బుధవారం వెలువడిన అనంతరం మేయర్ పదవికి ఎవరు అర్హుల్లో తేలిపోనున్నట్లు తెలుస్తోంది. వైసిపి రాష్ట్ర నాయకత్వం అర్హులెవరో నిర్ణయించనున్నట్లు సమాచారం.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేష్
ఎస్ఎఫ్ఐ 29వ జిల్లా మహాసభలు విజయవంతం

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థుల జీవితాలను గంజాయి ముఠా నాశనం చేస్తోందని, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓతూరు పరమేష్ అన్నారు. మంగళవారం విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ 29వ జిల్లా మహాసభలు నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించారు. ముందుగా ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షులు ఎద్దుల రాహుల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గంజాయి విచ్చలవిడిగా ముఠాలుగా ఏర్పడి అమ్ముతున్నారని పేర్కొన్నారు. దీని వల్ల విద్యార్థులు, యువత జీవితాలు నాశనమైతున్నాయన్నారు. ఓవైపు ప్రభుత్వం గంజాయిని అరికడతాం, డ్రగ్స్‌ను దూరం చేస్తామని చెబుతూనే, మరోవైపు గంజాయి ముఠాను అరికట్టడంలో విఫలమవుతుందని వాపోయారు. రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలని, అందుకు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయిందని, కనీసం విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలలో విద్యార్థులు భోజనాలు చేయడానికి డైనింగ్ హాల్ లేని పరిస్థితులు ఉందన్నారు. సంక్షేమ హాస్టల్లో తాగునీటికి దిక్కు లేదన్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓవైపు కళాశాల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో ఫీజులు తెలిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని, లేనిపక్షంలో ఇవ్వమని ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. దీనివల్ల వందలాది మంది విద్యార్థులు చదువు పూర్తయినా ఉద్యోగాలకు వెళ్లలేని దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఓవైపు రాష్ట్రంలోని విద్యాశాఖ మంత్రి తాము ఉన్నామని, సమస్యల పరిష్కరిస్తామని చెబుతూనే మరోవైపు వారి ఎమ్మెల్యేలు, ఎంపీల కళాశాలలో సర్టిఫికెట్లో ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తుంటే పట్టించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ట్రిపుల్ పి విధానంలో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ ఓవైపు ఉంటే విద్యాశాఖ మంత్రి తమ పార్టీ కేడర్ మీద దృష్టి పెడుతున్నారే తప్ప భవిష్యత్తును నిర్మించే విద్యావ్యవస్థ విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా పాఠశాలల కోసం, జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాల కోసం, డిగ్రీ విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి ప్రసంగించారు. ప్రతినిధుల సభ అనంతరం కడప జిల్లా అధ్యక్షులుగా జాలా సుమంత్, జిల్లా కార్యదర్శిగా వీరపోగు రవి ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆఫీసు బెర్రర్లుగా రాహుల్, అభినయ్, మోహన్, సుశాంత్, హరి, ను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా కౌసిక్, చారీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేష్

నెలాఖరులోగా స్మార్ట్ కిచెన్ షెడ్లు పూర్తి కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ల నిర్మాణ పనులను ఈనెల చివరి నాటికి పూర్తి చేసి అమలులోకి తీసుకురావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ల భవన నిర్మాణాల పురోగతిపై జెసి అదితిసింగ్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల స్మార్ట్ కిచెన్‌ల ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకాన్ని మరింత శుచిగా, రుచికరంగా, తాజాగా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్లు రాష్ట్రానికి ఆదర్శంగా ఉన్నాయని, ఇదే స్ఫూర్తితోనే జిల్లాలో నూతనంగా 33 స్మార్ట్ కిచెన్ షెడ్‌లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా మండలాల్లో స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులు ప్రారంభం అయి వివిధ దశల్లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇందులో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సిపిఒ హాజరతయ్య, డిఇఒ శంషుద్దిన్, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్, డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, యాంగ్ ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

నేటి నుంచి టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు పూటలా పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు ఒటాయి. ఈ నెల 21 వరకు ఆన్‌లైన్ పరీక్షలు ఉంటాయి. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందు హాజరు కావాలి. హాల్ టికెట్‌పై ఫొటో లేకపోతే, లేదా సరిగా కనిపించకపోతే అభ్యర్థులు తమ వెంట తాజా ఫొటో, ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసు కురావాలి. అలాగే ఆధార్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం వీటిలో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకోవాలి. హాల్ టికెట్ పోతే అభ్యర్థులు తమ దరఖాస్తు పత్రం ప్రింటౌట్‌తో పాటు జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో సహాయకుడిని సంప్రదించి హాల్ టికెట్ పొందవచ్చు. ఎలక్ట్రానిక్ పరికరాలు, క్యాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లను పరీక్షా కేంద్రంలోకి తీసుకురావడానికి అనుమతి లేదు.

వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే
ఆందోళన తప్పదు

ప్రజాశక్తి-కడప అర్బన్ : ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, పరిస్థితి ఇలాగే ఉంటే ఆందోళన తప్పదని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి తెలిపారు. మంగళవారం కడప రూరల్ ప్రాంతం చిన్నమాచుపల్లి వద్ద వరి ధాన్యాన్ని ఎపి రైతు సంఘం ప్రతినిధి బృందం గ్రామాలలో పర్యటించి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సమస్యలను రైతులను, కౌలు రైతులను అడిగి తెలుసుకున్నారు. మొంథా తుపాన్ వల్ల ధాన్యం దిగుబడులు తగ్గి రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు 10 బస్తాలకు పైగా దిగుబడి తగ్గిందని చెప్పారు. ధాన్యం పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, తగ్గిన దిగుబడి మేరకు పంటల బీమా పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీలు ఆచరణలో ఏమాత్రం అమలు కావడం లేదని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు పుట్టి ఎనిమిది బస్తాల వడ్లు రూ.14 వేలు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఉంటే, బహిరంగ మార్కెట్లో రూ. 12 వేలకే రైతులు అమ్ముకుంటున్నారని చెప్పారు. మద్దతు ధర కోల్పోవడంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని వాపోయారు. తేమ శాతం వంటి నిబంధనలు సడలించి కల్లాలో ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతాంగాన్ని కలుపుకొని ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుట్టుతామని హెచ్చరించారు. పర్యటనలో రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి తోపాటు చిన్న మాసుపల్లె రైతులు నారాయణరెడ్డి, పాలకొండయ్య, బాధిత రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మున్సిపల్ కార్మికులకు సమ్మెకాలపు వేతనం ఇవ్వాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. జులైలో నిర్వహించిన సమ్మెలో భాగంగా వారికి వేతనాలు ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల జీతాల పెంపు కోసం జులైలో దాదాపు పది రోజులు సమ్మె చేశారని పేర్కొన్నారు. ఆ సమ్మెలో భాగంగా ప్రభుత్వం దిగివచ్చి కార్మికులకు వేతనాలు పెంచిందని తెలిపారు. సమ్మె కాలం నాటి వేతనాలు ఇవ్వాలని,12వ పిఆర్‌సి అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మున్సిపల్ రాష్ట్ర కమిటీ వినతి పత్రం అందజేసిందని పేర్కొన్నారు. మున్సిపల్ మంత్రి నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ, సిడిఎంఎకు వివిధ రూపంలో వినతి పత్రాలు అందజేశామని చెప్పారు. ప్రభుత్వం ఆదేశించినా అధికారులు పట్టించకపోవడంతో రాబోయే రోజుల్లో ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కడప నగరంలో యాక్సిస్ బ్యాంక్ పేరు చెప్పి కాలం వెల్లదిస్తున్నారని విమర్శించారు. గత నెల నుంచి వేతనాలు పడకపోవడంతో కార్మికులు వస్తున్న పండగలకు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పర్మినెంట్ కార్మికులకు మాత్రం 62 సంవత్సరాలు పెట్టి, ఆప్కాస్ కార్మికులకు 60 సంవత్సరాలు రిటైర్మెంట్ ఇవ్వడం సమంజసం కాదని తెలిపారు. తల్లికి వందనం రావడం లేదని వాపోయారు. కార్మికులకు సమ్మె కాలం వేతనం, 62 సంవత్సరాల పెంపు, పిఆర్సి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన బాట తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయ భాస్కర్, జిల్లా కోశాధికారి గోపి, నగర ప్రధాన కార్యదర్శి వై.ఎం.కేశవులు, నగర కమిటీ సభ్యులు రాజేష్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు నిర్దిష్టమైన
లక్ష్యాన్ని ఎంచుకోవాలి : పీడీ

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

డ్వాక్రా మహిళా సంఘాలు నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా ముందుకు వెళ్లాలని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య ప్రెసిడెంట్ బుస కల్పన ఆధ్వర్యంలో మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులకు విజన్ -1పై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్ర మానికి పీడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ డ్వాక్రా, గ్రామ సంఘాలు ఒక నిర్దిష్ట మైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ దిశగా ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ముందుగా అందు బాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని మంచి జీవనోపాదులను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.ప్రతి సంఘా సభ్యురాలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

గ్రంథాలయ భవనాలు పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్ : మున్సిపల్ ఉర్దూ స్కూల్ సమీపంలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయం భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయిన నేపథ్యంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.1 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేస్తామని చెప్పారు. అనంతం కొండయపల్లెలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అవసరమైన తెలుగు అకాడమి పుస్తకాలను, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పుస్తకాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రామ కోటిరెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ ఎలిశెట్టి పవన్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ పి.రాజకుమార్, లైబ్రేరియన్ జి.రాజకుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నాదెండ్ల బాబ్జి, విశ్రాంత ఉద్యోగుల సంఘం కె.శ్రీనివాసులు, సీనియర్ సిటిజన్స్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మ్యూజియాన్ని సందర్శించిన సైన్సు క్లబ్ బృందం

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప నగరంలో చెన్నూరు బస్టాండు వద్ద నూతనంగా పునఃప్రారంభమైన సైన్స్ మ్యూజియాన్ని సర్ సి.వి. రామన్ సైన్సు క్లబ్ సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్లబ్ కడప డివిజన్ గౌరవాధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తిరిగి మ్యూజియం అందుబాటులోకి రావడం సంతోషకర మన్నారు. ఇందుకు సహకరించిన డిఇఒచరాష్ట్ర ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు. మ్యూజియం క్యురేటర్ రెహమాన్‌ను ఈ సందర్భంగా సభ్యులు శాలువ, పూలమాలతో సత్కరించి అభినందించారు కార్యక్రమంలో రామన్ సైన్స్‌క్లబ్ కడప డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా సైన్సు అధికారి ఎబెనెజర్, మాజీ జిల్లా సైన్సు ఆఫీసర్ నిత్యానంద రెడ్డి,రామన్ సైన్సు క్లబ్ సభ్యులు కిషోర్, గంగాధర్, విజయప్రసాద్, బాలాజీ, బాలకృష్ణ, డా.పార్వతి, సురేంద్ర, శ్రీధర్ పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి- కడప అర్బన్ : విశాఖలో నిర్వహించే సిఐటియు జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు పోస్టర్ పాత మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 31 నుంచి ప్రారంభమయ్యే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ మహాసభల్లో 13 గంటల పని విధానానికి వ్యతిరేకంగా తీర్మానం చేయనున్నారని తెలిపారు. ఈ మొండి ప్రభుత్వాలను మెడలు వంచడం కోసం ప్రతి కార్మికుడు జనవరి 4న నిర్వహించే బహిరంగ సభకు విశాఖపట్నంకు కదిలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, నగర అధ్యక్షులు సుంకరి రవి, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరాములు, నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, నగర కమిటీ సభ్యులు సుంకరి కిరణ్, వడ్లపల్లిపాల్గొన్నారు. **బద్వేలు :** సిఐటియు జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ కన్వీనర్ యం.చిన్ని పేర్కొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి బిల్డింగ్ కార్మికుల అడ్డా వద్ద మహాసభలు జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ మహాసభల కరపత్రాలను ఆవిష్కఃరించారు. పట్టణంలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జనవరి 4 తేదీన జరగనున్న బహిరంగ సభను, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అకడమిక్ కన్సల్టెంట్ల భాగస్వామ్యం అవసరం : విసి

ప్రజాశక్తి- కడప అర్బన్ : విశ్వవిద్యాలయం జాతీయస్థాయి ర్యాంకులు పొందడంలో అకడమిక్ కన్సల్టెంట్ల పాత్ర కూడా కీలకమని యోగి వేమన విశ్వ విద్యాలయం విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. అన్నమాచార్య సేనేట్ హాల్లో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్‌తో కలిసి విసి అకడమిక్ కన్సల్టెంట్లుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అకడమిక్ కన్సల్టెంట్ మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టుల్లో విజ్ఞానాన్ని పొందాలని, బలమైన బయోడేటాను రూపొందించుకోవాలని సబ్జెక్టుల్లో విస్తృత జ్ఞానాన్ని పొందడమే కాకుండా, పరిశోధనా పత్రాలను ఎక్కువగా రాయాలని చెప్పారు. విశ్వవిద్యాలయం పేరుతో వాటిని ప్రచురించాలన్నారు. బోధనా నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని సూచించారు. 110 జీవోను అమలుచేయడానికి ప్రయత్నిస్తామన్నారు. మంచి బోధకులుగా పరిశోధకులుగా తయారయ్యేందుకు అవసరమైన సౌలభ్యాలు కల్పిస్తామన్నామని చెప్పారు. ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాల్లోని ఫ్యాకల్టీతో కలసి పరిశోధన పత్రాలు రాయాలని అందుకు తమ సహకారం ఉంటుందన్నారు

సున్నితమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ ప్రభావిత, రాజకీయంగా సున్నితమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులను ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశించారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లు, గతంలో ఎన్నికల నేరాలకు పాల్పడిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాల యంలో పులివెందుల సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా భద్రతపై గ్రామాలు, కాలనీలు, పాఠశాలలు, కళాశాలలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో సోషల్ మీడియా వల్ల కలిగే మహిళలు, బాలికల వేధింపులపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వాస్తవాలను నిర్ధారించుకుని నిర్ణీత వ్యవధిలోగా చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గ్యాంబ్లింగ్, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని, దాడులు ఉధృతం చేయాలని చెప్పారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి గస్తీని పెంచడంతో పాటు గ్రామ సభలు, పల్లె నిద్ర, గ్రామాల సందర్శన తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా రిసెప్షనిస్టుల ద్వారా మహిళల సమస్యలపై వచ్చే ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పులివెందుల డి.ఎస్.పి మురళి నాయక్, సబ్ డివిజన్ లోని సిఐలు, ఎస్‌ఐ లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి విశ్వనాథ్

ఎపి ఫార్మా జెఎసిని గెలిపించాలి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ఫార్మా కౌన్సిల్ ఎన్నికల్లో ఎపి ఫార్మా జెఎసిని గెలిపించాలని జెఎసి సమన్వయకర్త సింగనమల సుమన్ పిలుపునిచ్చారు. మంగళవారం కడప ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టంలో 16 ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌కు మొట్టమొదటిసారిగా ఎన్నికలు నిర్వహించనున్నారని చెప్పారు. 2025 నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. కడప జిల్లాఖఎ సుమారు 4 వేల మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఈ ఎన్నిక పూర్తిగా పోస్టల్ బ్యాలెట్ విధానంలో జరుగుతున్నాయని చెప్పారు. ఫార్మా జెఎసి ప్యానల్ తరపున కడప జిల్లా నుంచి, పెంచల నరసింహులు, (సీరియల్ నెంబర్ 6), గూటం జగదీష్ (సీరియల్ నం.10), కర్నూలు నుంచి డాక్టర్ దేవేంద్ర నాయక్ (సీరియల్ నం.14), విశాఖపట్నం నుంచి ఆర్.ప్రకాశ్‌రావు (సీరియల్ నం.27), తిరుపతి నుంచి డాక్టర్ ఆర్.శ్రావణ్ కుమార్ (సీరియల్ నం.28), గుంటూరు నుంచి షేక్ హస్సన్ (సీరియల్ నం.32) పోటీలో ఉన్నారని తెలిపారు. ఈ ప్యానల్ అధికారంలోకి వస్తే ఫార్మసిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు మాట్లాడుతూ ఇతర వామపక్ష సంఘాలతో కలిపి జెఎసికి మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్రంలోని ఫార్మసిస్టులందరూ డ్రగ్ ట్రేడ్ మాఫియా కళాశాలల కార్పొరేట్ మాఫియాకు వ్యతిరేకంగా జెఎసి సభ్యులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు, డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఫార్మసిస్టులే చట్ట ప్రకారం మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ చట్టం అమలు అవ్వాలంటే ఎపి ఫార్మా జెఎసి ప్యానెల్ సభ్యులని ఫార్మసిస్ట్ అందరూ కలిసి ఐక్యంగా ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు గూటం జగదీష్, పెంచల నరసింహులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వెలుగు సిసి మృతి

ప్రజాశక్తి -పోరుమామిళ్ల : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సిసిగా పనిచేయుచున్న మేకల శివరామ కృష్ణయ్య(50) గుండె పోటుతో మృతిచెందారు. మృతుడు మండలంలోని టేగురుపేట క్లస్టర్లు విధులు నిర్వహిస్తూ ఉండేవాడు. మంగళవారం ఉదయం విధులకు వచ్చే ముందుగా తన స్వగృహంలో గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగానే అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పీడీ రాజ్యలక్ష్మి, సిబ్బంది స్వగృహానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తమై రూ. 25 వేల నగదు అందజేశారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు
18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్

ప్రజాశక్తి-కడప అర్బన్ : ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్‌పి చికేత్ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనానికి పాల్పడుతున్న సయ్యద్ గౌస్‌బాషా, షేక్.మహబూబ్ బాషా, వేల్పుల నరేంద్ర జల్సాలకు అలవాటు పడి బైక్‌ల దొంగతనాలకు పాలపడుతున్నారని చెప్పారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనేక మోటార్ సైకిల్ దొంగతనాలపై ఫిర్యాదులు రావడంతో వీటి ఆధారంగా కేసులు నమోదు చేసి వన్ టౌన్ సిఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో ఎస్‌ఐ ప్రదీప్ కుమార్ పోలీసులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.20 రోజులుగా పట్టణంలో నిఘ ఏర్పాటు చేసి అనుమానాస్పదమైన ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారని తెలిపారు. ఈ క్రమంలోనే సిసి ఫుటేజ్‌ల ద్వారా ముద్దాయిలను గుర్తించామని చెప్పారు. మంగళవారం సిఐ తన సిబ్బందితో కలిసి మోచంపేటలోని సర్కిల్ వద్ద నిందితులను అరెస్టు చేశారని పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ. 10 లక్షలు విలువచేసే 18 ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వీరిలో ప్రధాన నేరస్థుడు వేల్పుల నరేంద్ర పరార్ లో ఉన్నారని త్వరలో పట్టుకుంటామని చెప్పారు. బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలిస్తున్నట్టు పేర్కొన్నారు.

అధిక సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చూడాలి

ప్రజాశక్తి - కడప : ఈనెల 13 న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి. యామిని, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం ముందస్తు జాతీయ లోక్ ఆదాలత్ సమావేశాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘించిన వారిపై ఉన్న ట్రాఫిక్ చలానాలను 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో అనగా సెటిల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జిలు పాల్గొన్నారు.

ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - కడప : ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం కడప రిమ్స్ ఆవరణంలని జిల్లా సత్వర చికిత్స కేంద్రం, జిల్లా బాల భవిత కేంద్రాన్ని సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాలలోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన పిల్లల తల్లిదండ్రులు ఇలాంటి చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించాలని కోరారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-కాశినాయన

రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయాధికారి చంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోంటువారిపల్లి గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సాగులో ఉన్న కంది పంటలో పురుగు నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటను పరిశీలించి పంటలో పెనుబంక, పచ్చదోమ ఉందని గుర్తించి నివారణకు ఆసిఫేట్ 2 గ్రాములు, ప్రాపినోఫస్2 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.రవి, వి.ఎ.ఎ. ముని కుమారి, రైతులు పాల్గొన్నారు. **కలసపాడు :** మండలంలోని మహానందిపల్లి, మామిళ్ళపల్లి గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వేసుకొనే పంటలు ముందస్తు చర్యలో భాగంగా విత్తనశుద్ధి చేసిన తరువాతే విత్తనాలు నాటుకోవాలని సూచించారు. కచ్చితంగా ఈ పంటనమోదు చేసుకోవాలన్నారు. యూరియా వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం పద్ధతులు ఆచరించి ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సుబ్రమణ్యం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కాశినాయన : రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బస్సులు నిలపడంలేదని ఎన్‌హెచ్‌పై నిరసన

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని కుమ్మరికొట్టాలు వద్ద జాతీయ రహదారి సమీప గ్రామాల విద్యార్థులు బస్సులు నిలపడం లేదంటూ మంగళవారం జాతీయ రహదారిపై అడ్డంగా నిలబడ్డారు. ఆర్టీసి హైర్ బస్సులు చెయ్యెత్తినా ఆపకుండా పోతున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు బస్సులు సరిగా ఆపటం లేదన్నారు. ప్రతిరోజు పాఠశాలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుందని, ఒక్కోసారి బస్సులు ఆపకపోవడంతో ఆటోలో వెళుతున్నామని వాపోయారు. ప్రయాణికులు పెరిగిన మేరకు బస్సుల సంఖ్యను పెంచడం లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం తమలాంటి విద్యార్థులకు ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉన్నత అధికారులు స్పందించి బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్తామని విద్యార్థులు తెలిపారు.

సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని వైసిపి పట్టణ అధ్యక్షుడు వై.జయరామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి నేతలు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. స్థానిక దొండపాడు ప్రాంతంలో మంగళవారం జయ రామ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలని చూస్తోందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను నిర్మించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలని ఆలోచించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో దొండపాడు వైసిపి నాయకులు చిన్నయ్య, చిన్న గంగన్న పాల్గొన్నారు.

రేపు ముద్దనూరు ఎంపిపి ఎన్నిక

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు ఎంపిపి పదవి ఎన్నికను గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రాధాకృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శెట్టివారిపల్లె ఎంపిటిసిగా ఎన్నికైన కుడుముల ప్రదీప్ కుమార్ రెడ్డి ఎంపిపిగా మండల సర్వసభ్య సమావేశాలకు గైర్హాజ రయ్యారు. ఆ కారణంగా ఆయనను ఎంపిపి పదవి నుంచి తొలగించినట్లు చెప్పారు. ఎన్నికల అధికారి, జమ్మలమడుగు ఆర్డిఒ సాయిశ్రీ ఆధ్వర్యంలో గురు వారం ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 మంది ఎంపిటిసిలకుగానూ 9 మంది ఎంపిటిసిలు ఎన్నికలో పాల్గొని ఎంపిపిని ఎన్నుకుంటారని ఎంపిడిఒ వివరించారు.

12న వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

క్రీడా మంత్రిత్వ శాఖ, అమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మైదుకూరు నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు ఈనెల 12న శుక్రవారం మేధా డిఫెన్స్ అకాడమీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు మై భారత్ యువ అధికారి పి.ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో 16-28 ఏళ్లలోపు యువకులు పాల్గొనాలని సూచించారు. గెలుపొందిన జట్టుకు నగదుతోపాటు ట్రోఫీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన జట్లను జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. పాల్గొనదలిచిన జట్టు వి.శివశంకర్ 85200 01065కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

మంత్రి ఫరూక్ తనయుడ్ని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

మంత్రి తనయుడి దృష్టికి మైనార్టీల సమస్యలు

ప్రజాశక్తి - ఖాజీపేట

రాష్ట్ర మైనారిటీ, న్యాయ మంత్రిత్వశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తనయుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్‌ను మంగళవారం ఖాజీపేట ముస్లిం మైనారిటీ నాయకులు కలిశారు. కడప నగరంలో జరుగుతున్న ఇస్తమాకు ఆయన వెళ్తుండగా మార్గమధ్యలో సన్మానించారు. టిడిపి ముస్లిం మైనారిటీ జిల్లా కార్యదర్శి కమలాపురం గౌస్‌మొద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మైనారిటీల సమస్యలను ఆయనకు వివరించారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. కార్య క్రమంలో మైనారిటీ నాయకులు మహబూబ్ బాషా, టప్పా ఖాసీం పీరా, కమ లాపురం నూర్, టప్ప సాదిక్‌పీర్, గౌస్ లాజం, జాఫర్ హుస్సేన్, షేక్ హుస్సేన్, వనిపెంట సాదికుల్లా పాల్గొన్నారు.

ప్రతిభను చాటుకున్న 'బీరం' విద్యార్థులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని కొత్త నెల్లూరు సమీపంలో ఉన్న బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల విద్యార్థులు దేశ వ్యాప్త ప్రతిభను చాటుకుని ఆదర్శంగా నిలిచారు. ముంబైలోని జాతీయ విద్యా, మానవ వనరుల సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన, అందమైన అక్షరాల రాత పోటీల్లో మొత్తం 26 మంది విద్యార్థులు విజయం సాధించారు. వీరు జనవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బీరం విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏ పోటీలోనైనా గెలుపు సాధించాలి అంటే ముందుగా వినిపించే పేరు బీరం విద్యార్థులదేనన్నారు. చేతిరాత మన వ్యక్తిత్వానికి, శ్రద్ధకు, సహనానికి, సృజనాత్మకతకు అద్దం పడుతుందన్నారు. సంస్థ చైర్‌పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేత, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

సస్యరక్షణతోనే తెగుళ్ల నివారణ

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రవీంద్రకుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలను చేపడితే పంట మంచి దిగుబడులు వస్తాయని కొవ్వూరు సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రకుమార్ పేర్కొన్నారు. మండలంలోని బక్కన్నగారిపల్లి రైతు సేవా కేంద్రంలో మంగళవారం అరటిసాగు చేసిన రైతులకు సిగటొక ఆకుమచ్చ తెగులు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అరటిలో సస్యరక్షణ చర్యలతోపాటు గెలల యాజమాన్యంపై రైతులకు శిక్షణనిచ్చారు. అరటి పరిశోధనా స్థానం, కొవ్వూరు సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్ర కుమార్, ఉద్యాన శాఖ సహాయ సం చాలకులు పి.రవిచంద్ర బాబు మాట్లాడుతూ అరటి పంటలో ఎరువులు వేయడం అనేది మొక్కలు నాటిన 20 రోజుల నుండి ప్రారంభించాలని సూచించారు. ఏడు నెలల వరకు అరటికి వేయాల్సిన ఎరువులలో 80 శాతం వేసుకోవాలన్నారు. మిగతా 20 శాతం ఎరువులు గెల వేసిన తర్వాత వే యాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో గ్రామ రైతులు, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలం వరదాయపల్లె, కొత్తపల్లె గ్రామాలలో రబీ పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఇ.బాల గంగాధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వరి పంటలో ఉన్న సమస్యలు, ఆ గ్రామాల్లో సాగు చేసిన పంటల స్థితిగతుల గురించి రైతులతో చర్చించారు. రబీ సీజన్‌కు సంబంధించి క్రాప్ ఇన్సూరెన్స్, పంట నమోదు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి గుర్రప్ప, వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రధానమంత్రి పసల్ బీమా పథకాన్ని రైతులు సద్వి నియోగం చేసు కోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి సూచిం చారు. కమ్మవారిపల్లె, మం గపట్నం గ్రామాల్లో మం గళవారం ఎడిఎ ఆధ్వ ర్యంలో ఎఒ వెంకట కృష్ణా రెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో సాగు చేసిన పం టలను తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. శెట్టివారిపల్లె రైతు సేవా కేంద్రంలో యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులకు రాయితీతో అందించేందుకు క్రిమిసంహారక మందులు వేపనూనె, హెక్సా కొనజోల్, ప్రోపికొనజోల్, పిప్రొనిల్, కొరాజిన్, అష్టమా ఫ్రైడ్ అందు బాటులో ఉన్నాయన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గు చూపాలన్నారు. కంది, మినుము పంటలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర శేఖర్ నాయుడు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - కడప

దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో ఎయిర్ లైన్స్ సంక్షోభానికి సంబంధించి ఏమాత్రం వివరణ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు నైతిక బాధ్యత వహించి తక్షణం రాజీనామా చేయాలని వైసిపి డాక్టర్స్‌వింగ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం. నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజులుగా అందరూ గమనిస్తూనే ఉన్నారని ఎయిర్‌పోర్టులు అన్ని మార్కెట్లను తలపించేగా మారాయన్నారు. ఎయిర్ పోర్టులో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఏ విమానం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితిలో గందరగోళానికి గురయ్యారని వాపోయారు. అలాంటి పరిస్థితుల్లో ప్రయాణికులు భయభ్రాంతులకు గురై సిబ్బందితో గొడవ పడిన సందర్భాలున్నాయని చెప్పారు. సిబ్బంది కూడా సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇండిగో ఎయిర్ లైన్స్ అంటేనే మన ఇండియాలో ఒక మేజర్ ఎయిర్లైన్స్ సంస్థ అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎయిర్ ఇండియాను ఒక సంక్షోభంలోకి తీసుకువచ్చి, ఓ ప్రయివేట్ సంస్థ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.నాగార్జున రెడ్డి

అయిన టాటాకు కట్టబెట్టారని విమర్శించారు. ఇప్పుడు ఇండిగో సంక్షోభం మరి ఎవరికి లాభం చేకూర్చడానికో, ఎవరికి నష్టం చేకూర్చడానికో వారికే తెలియాలన్నారు. వ్యవస్థని సక్రమంగా నడప లేనప్పుడు దానికి ఒక కేబినెట్ హోదా మినిస్టర్ ఎందుకని ప్రశ్నించారు. వెంటనే కేంద్ర విమానయాన శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్‌టియు నగర అధ్యక్షులు నాగరాజు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ పెట్రోల్ బంకులో అవినీతి : టిడిపి

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్న మున్సిపల్ పెట్రోల్ బంకులో రూ.కోట్ల అవినీతి జరిగిందని టిడిపి పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు మునిసిపల్ పెట్రోల్ పంపు ద్వారా కొంతకాలంగా జరిగిన అక్రమాలు బయటపడ్డాయన్నారు. 2021-22 నుండి ఇప్పటి వరకు సుమారు రూ.1 కోటి 30 లక్షల డబ్బు లావాదేవీల తేడా ఉన్నప్పటికీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారెడ్డి సహా వైసిపి నాయకులు నోరు కూడా కదపలేదని విమర్శించారు. సాధారణ కార్యకర్త ఒక చిన్న వివాదం జరిగినా ర్యాలీలు, ధర్నాలు నిర్వహించే వైసిపి నాయకులు ఇంత పెద్ద ఆర్థిక బకాయిలు బయటపడినా నిశ్శబ్దంగా ఉండటం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిధులు, పన్ను చెల్లింపుదారుల డబ్బు తేడాపై ప్రజలకు జవాబు చెప్పాలని, మున్సిపల్ నిర్వహణలో జరిగిన అవినీతి అంశంపై అధికార పార్టీ బాధ్యత వహించాలన్నారు. ఇటీవల మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఎక్కడ చూసినా ప్రామాణికత, పారదర్శకత గురించి మాట్లాడుతున్నారని, ఒక పంచాయతీ వ్యవహారంలో రూ.20 లక్షలు తీసుకున్నట్టు ఆరోపణలు చేయడం పూర్తిగా తప్పుడు ప్రచారమని మురళి ఖండించారు. తనపై ఎలాంటి ఆరోపణలైనా ప్రజల ముందు మీడియా సాక్షిగా ప్రమాణానికి సిద్ధమని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు పక్కన పెట్టి పదవి, డబ్బు రాజకీయాలే వైసిపి నేతల అసలు లక్ష్యమని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు వైసిపికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

14 ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - లింగాల

గత 14 ఏళ్లుగా భూ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని బోనాల గ్రామానికి చెందిన దాసరి రంగయ్య అనే రైతు తెలిపారు. తనకు ఉన్న 4.86 ఎకరాల భూమికి సంబంధించిన హద్దులు చూపించాలని 14ఏళ్లుగా కార్యా లయాల చుట్టూ తిరుగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరి ష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు రైతు వినతి పత్రం అంద జేశారు లింగాల తహశీల్దారు కార్యాలయ సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతుకు హద్దులను మంగళవారం చూపించారు. దీంతో రైతు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్కేవ్యాలీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ క్యాంపస్ టోర్నమెంట్‌లో ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా తెలిపారు. అంతర్ క్యాంపస్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం ఇడుపులపాయి క్యాంపస్‌లో డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, ఎఓ పెనుకొండ రవికుమార్ అభినం దిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు క్యాంపస్‌లో ఈనెల 4 నుండి 6 వరకు ఆర్జీయూకేటీ అంతర క్యాంపస్ టోర్నమెంట్ క్రీడా పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. బాస్కెట్ బాల్‌లో 7 మంది, బ్యాడ్మింటన్‌లో 7 మంది, వాలీబాల్‌లో 3, చెస్‌లో 4 అత్యంత ప్రతిభ చాటినట్లు చెప్పారు. అంతర్ విశ్వవిద్యాలయ దక్షిణ మండల టోర్నమెంట్లకు వీరు ఎంపికైనట్లు తెలిపారు. అభినందన కార్యక్రమంలో డీన్ రమేష్, ఫిజికల్ డైరెక్టర్లు రమణారెడ్డి, బాల, ఓబయ్య, షంశాద్ బేగం, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వాసవి మాతను దర్శించుకున్న హంపీ పీఠాధిపతి

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు శ్రీమరకత వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానాన్ని హంపీ పీఠాధిపతి విరూపాక్ష వేద నారాయణస్వామి సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని వినతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులో ట్రాఫిక్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని, ముఖ్యంగా బివిఎస్ థియేటర్, పాత బస్టాండ్, అన్వర్ థియేటర్ ప్రాంతాల్లో వాహనాల రద్దీతో తీవ్ర ఇబ్బందులకు దారితీస్తోందని నియంత్రించాలని పిఎంజె నాయకులు కోరారు. ప్రతిరోజు సాయంత్రం 4. గంటల సమయంలో బివిఎస్ థియేటర్ దగ్గర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు ఆగిపోయే పరిస్థితి వస్తుందని, ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని మంగళవారం పిఎంజె రాయలసీమ ఇన్‌ఛార్జి ఎండి అయూబ్ ఖాన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, ఎస్పీ ముక్తి యార్, ఫరాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు మంగళవారం స్నాక్స్, రిఫ్రెష్‌మెంట్స్ పంపిణీ చేశారు. యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలి. విద్యార్థులు సాయంత్రానికి అలసిపోతారని, ఉపశమనం కోసం స్నాక్స్ రిఫ్లేస్మెంట్స్ అందించాలని ప్రధానోపాధ్యాయుల సూచించారు. ఆ మేరకు ప్రధాన ఉపాధ్యాయులు నాగేంద్ర కుమార్ విద్యార్థులకు నాలుగు రోజులకు సరిపడే స్నాక్స్, రిఫ్రెష్‌మెంట్స్ డొనేట్ చేశారు. వంద రోజులకు సరిపడా వాటిని దాతలు ఇవ్వాలని పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు.

PASSPORT LOST

I, A. Venkata Maheedhar, residing at 38/6353-4, Ramanjaneyapuram A, Revenue Ward-38, Chinna Chowk, Kadapa Town, Kadapa District, have lost my Passport bearing **No. N3995062 on 06/12/2025** while travelling in an auto to Apsara Circle. If found, kindly inform at the above-mentioned address or contact **95530025**.

MUNICIPAL CORPORATION KADAPA

'ap e-procurement Tender Notice. 873564 to 873815/A TO /25-26/ MCK Date. 10.12.2025

Sl.No	Description	No. of works	Esti. Rs. In Lakhs
1	NCAP	14	230.75
2	General Funds	08	56.65
	TOTAL:-	16	188.94

	Bid Document Download Start Date	Bid Document Download End Date	Bid Submission Closing Date & Time
01	08/12//2025 3.00 PM	24/12/2025 03.00 PM	24/12/2025 03.30 PM
02	10/12//2025 3.00 PM	24/12/2025 03.00 PM	24/12/2025 03.30 PM

Further details can be seen at 'e' Procurement market place in www.apeprocurement.gov.in officer inviting bid, Commissioner, Municipal Corporation of Kadapa, A.P

Commissioner,
Kadapa Municipal Corporation,
YSR District

తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో సచివాలయం పక్కన తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. సచివాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పశువైద్యశాల సమీపంలో ఉండడం వల్ల నిత్యం ప్రజలతోపాటు పశువులు కూడా సంచరిస్తుంటాయి. ట్రాన్స్‌ఫార్మర్ చాలా తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో పశవులు మృతి చెందిన సంఘటనలున్నాయి. నిత్యం విద్యార్థులు, ప్రజలు సంచరిస్తున్న ప్రదేశంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్ తొలగించడం లేదా ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇండియా జట్టులో స్థానం సాధించిన తేజేంద్ర

ప్రజాశక్తి - వేంపల్లె

గోల్ షాట్‌బాల్ క్రీడకు సంబంధించి ఇండియా జట్టుకు స్థానిక రాచ వీటి తేజేంద్ర ఎంపికయ్యారు. వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫిజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. పంజాబ్ రాష్ట్రంలో గత నవంబర్‌లో జరిగిన గోల్ షాట్‌బాల్ ఇండియా జట్టు ఎంపికలకు హాజరై ప్రతిభ కనబరిచి ఇండియా జట్టులో స్థానం సంపాదించారు. తేజేంద్ర ఈనెల 5వ నుండి 13వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో ఉన్న ప్రాక్టీస్ క్యాంప్‌లో ఇండియా జట్టులో శిక్షణ పొంద నున్నారు. ఈనెల 16 నుండి 19వ తేదీ వరకు నేపాల్ దేశం ఖాట్మండులో జరిగే సౌత్ ఏషియాన్ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలకు హాజర వుతున్నాట్లు గోల్ షాట్‌బాల్ ఎపి రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర, కార్యదర్శి మనో హర్‌రెడ్డి తెలిపారు. తేజేంద్ర తండ్రి మారన్న శ్రీగండి వీరాంజనేయ స్వామి దేవ స్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తేజేంద్ర క్రీడాప్రస్థానం తన చిన్ననాటి నుండి మొదలు 2009 నుండి 2025 వరకు కబడ్డీ, హ్యాండ్‌బాల్, తేక్వాండో, షూటింగ్ బాల్ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. మొదటసారిగా ఇండియా జట్టులో స్థానం సాధించడంతోపాటు క్రీడాకారుని జీవిత కలలో ఒకటైన ఇండియా జట్టులో ఆడడం తన ఆశయంగా పెట్టు కున్నానని, ఆ కల నేడు నెరవేర బోతున్నట్లు తేజేంద్ర ఆనందం వ్యక్తం చేశారు. ఇండియా జట్టులో స్థానం సంపా ధించడం పట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

త్యాగానికి మారుపేరు సోనియాగాంధీ

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ త్యాగానికి, పెద్దరికానికి, హుందా తనానికి ప్రతి రూపమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో సోనియా గాంధీ 79వ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక, లౌకిక, సామ్యవాద పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకి సోనియా గాంధీ 19 ఏళ్లపాటు అధ్యక్షురాలుగా ఉండడం గర్వకారణమన్నారు. సోనియాగాంధీ కృషి వల్లనే ఐక్యరాజ్యసమితి మహాత్మా గాంధీ పుట్టినరోజు అక్టోబర్ 2ను అంతర్జాతీయ అహింసా దినంగా ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, పిసిసి డెలిగేట్ అత్తింజేరి శ్రీనాథ్, లింగం సతీష్, మణి, విజయ్‌కుమార్, అమర్నాథ్ రెడ్డి, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, నాగరాజు, వేమయ్య, బద్రి, వినయ్, రాఘవ పాల్గొన్నారు.

చక్రాయపేట : మండలంలోని గండికోవూరు గ్రామానికి చెందిన రామిరెడ్డిగారి సిద్ధారెడ్డి సతీమణి రమాదేవి సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. సిద్ధారెడ్డి గతంలో రెడ్డి పని చేస్తూ రిటైర్డ్ అయ్యారు. పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగం రామకృష్ణారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, చిన్నకోట్ల నాగరాజు, నామా వినయ్ రమాదేవి మృతదేహానికి మంగళవారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అవినీతి అంతమైతేనే మంచి సమాజం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దేశాన్ని పట్టిపీడిస్తున్న పెద్ద సమస్య అవినీతి అని, దీన్ని అంతమందించినప్పుడే మంచి సమాజాన్ని, విలువలతో కూడిన సమాజాన్ని చూడగలుగుతామని పినాకిని యూత్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్ రాజు తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రామేశ్వరం ఎస్పీసీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యబాబు, ఉపాధ్యాయులు సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిపిపి విధానాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే పేదవారి డాక్టర్ కల దూరమవుతుందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాలనలో ఫీజులు పెరిగి, వైద్యం కూడా లాభాల వ్యాపారమవుతుందని విమర్శించారు. మంగళవారం స్థానిక రూరల్ పరిధిలోని దొరసానిపల్లె తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలనే ప్రయత్నాన్ని రాచమల్లు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ ఆలోచన విధానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

In the court of the Senior civil Judge Proddatur
S.O.P.NO. 5/25

Tamidepati Rajeswari w/o late T.Venkata subbaiah aged 55 years resident at D.NO 12/63-A Sivunimanyam Street, Mydukur, Kadapa District%. ...పిటిషనరు

V.S

1. The Manager, LIC of India.Proddatur.
2. The Branch post Mater, post office, Mydukur Branch, Mydukur, Kadapa District% ....రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

పైనెంబర్ గల పిటిషనరు అయిన తమిదేపాటి రాజేశ్వరి క్రింద వివరించిన షెడ్యూలు దాఖల డిపాజిట్లకు సక్ససన్ కోరి పై కోర్టు యందు పై S.O.P ని దాఖలు చేసి ఉన్నది. అట్టి యొక్క క్రింద షెడ్యూలు దాఖల డిపాజిట్ల పై ఎవరికైన ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు యందు 18-12-25 వ తేదీన 10:30 ని॥లకు హాజరు అయ్యి ఆక్షేపణలను తెలుపుకొన వలెయును లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

ITEM NO: 1 (Which is in the custody of Perpondent No1) the deceased T. Venkata Subbaiah has Insurance, Policies i.e., Policies No.S are 1)651303800-50,000/- 2) 653076318 - Rs 69,539/- and 3) 650158063 , Rs 25,000/- with interests are in the Life Insurance corporation ltd., Proddatur.

ITEM NO:-2:- (Which is in the custody of Respondent No :-2),The deceased T. Venkata Subbaiah.was having amount in MIS schemes i.e;

1) in Account No :- 8652 Rs 50000/-
2) Account No:- 8653 Rs 50,000/-
3) Account No:- 9132 Rs. 50,000/-
4) Scheme 5 years R.D Account No:- 5431845 RS.38230/-
5) Account No:- 5431632 Rs 45,000/-
6) Account No:- 5430840 Rs 94,000/-
7) Account No 5431233 Rs 93,800/- and
8) Account No :- 543123 Rs.93800/- in Branch Post master, Post office, Mydukur.

Total amount of Rs:- 6,60,000/-

రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు
A.V.Ramana
Advocate, Mydukur,Proddatur